క్లుప్తంగా

ముగిసిన హోం ఓటింగ్



ఎన్నికల ప్రక్రియలో అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలో చేపట్టిన హోం ఓటింగ్ ప్రక్రియ శనివారంతో ముగిసింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 80సంవత్సరాలు పైబడిన వారితో పాటు దివ్యాంగ ఓటర్లకు హోం ఓటింగ్ అవకాశం కల్పించారు. మండలంలో 40మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా 28మంది సీనియర్ సిటిజన్‌లు, 12మంది దివ్యాంగ ఓటర్లు ఈ ఓటింగ్‌లో భాగంగా ఓటు వేశారు.

తాండూర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శనివారం తాండూర్ మండలంలో హోం ఓటింగ్ ప్రక్రియను ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. ఈ సారి ఎన్నికల కమిషన్ వృద్ధులు, దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు గల వారికి ఇంటి వద్దనే ఓటింగ్ వేసే అవకాశాన్ని కల్పించారు. మండలంలోని బోయపల్లి, తాండూర్, కొత్తపల్లి, మాదారం పరిధిలోని నలుగురు ప్రత్యేక అవసరాలు గల, ఐదుగురు వృద్ధులకు ఓటింగ్ అవకాశం కల్పించడంతో వారు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

27న బెల్లంపల్లిలో ప్రవీణ్‌కుమార్ రోడ్‌షో

బెల్లంపల్లి: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 27న బెల్లంపల్లిలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ రోడ్ షో నిర్వహిస్తారని బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి జాడి నర్సయ్య తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు గోమాస గోవర్ధన్, బ్రహ్మానందం, రవితేజ, రాజశేఖర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తాండూర్: మండలంలోని తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. పారిశుధ్య పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. నీటి సౌకర్యం, లైటింగ్ తదితర పనులు పూర్తి చేయాలన్నారు. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వర్, బీఎల్‌వోలు తదితరులు ఉన్నారు.

కాసిపేట: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో శనివారం ఎంపీడీవో ఎంఏ అలీం 22 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. లంబాడితండా(కె), పాతవరిపేట, పల్లంగూడ, కోమటిచేను, కొండాపూర్, కోనూర్, ధర్మరావుపేట, వెంకటపూర్, సోనాపూర్, గట్రావుపల్లి, దేవాపూర్‌లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

'సింగరేణిని కాపాడింది కేసీఆరే'



మాట్లాడుతున్న బాల్క సుమన్

చెన్నూర్‌రూరల్/మందమర్రిరూరల్/కోటపల్లి/భీమారం/చెన్నూర్/జైపూర్: కాంగ్రెస్ పార్టీ సింగరేణి సంస్థను నాశనం చేస్తే.. బీజేపీ సింగరేణిని అమ్మాలని చూస్తుందని.. సింగరేణిని కాపాడింది సీఎం కేసీఆరే అని చెన్నూర్ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గని, ఐకే-ఓసీపీపై, కోటపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, మాజీ మంత్రి బోడ జనార్దన్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మందమర్రి, చెన్నూర్, చెన్నూర్‌రూరల్, భీమారంలో నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు.

'5 వేల ఉద్యోగాలు కల్పిస్తాం'



మాట్లాడుతున్న రఘునాథ్‌రావు

శ్రీరాంపూర్: ఈ ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంచిర్యాల నియోజకవర్గంలో తన ఐదేళ్ల పదవి కాలంలో 5వేల మందికి ఉద్యోగాలిప్పిస్తానని బీజేపీ మంచిర్యాల నియోజకవర్గం అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్‌రావు తెలిపారు. శ్రీరాంపూర్ ఆర్కే 8 డిస్పెన్సరీ వద్ద గల అంబేద్కర్ మైదానంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానన్నారు. ఒక్కసారి అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నడవాలంటే.. నరకమే..!

- నాలుగు కిలోమీటర్లు రాళ్లు తేలి అధ్వానం..
- శిథిలమైన ఊట్ల రోడ్డు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



ఊట్ల రోడ్డు దుస్థితి..

దండేపల్లి: మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న ఊట్ల గిరిజన గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తి శిథిలావస్థకు చేరింది. దీంతో రోడ్డు గుండా ప్రయాణం నరకయాతనను తలపిస్తోంది. దండేపల్లి నుంచి ఏడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఊట్ల గిరిజన గ్రామానికి వెళ్లేందుకు 4కిలో మీటర్ల మేర మెటల్ రోడ్డు ఉంది. రోడ్డు మొత్తం రాళ్లు తేలి ఉండటంతో వాహనదారులు, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ అటవీ శాఖ అనుమతులు ఇవ్వలేదు. దీంతో రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. దండేపల్లి నుంచి ఫారెస్ట్ ఎంట్రెన్సీ వరకు మాత్రమే బీటీ రోడ్డు, ఆ తరువాత మొత్తం మెటల్ రోడ్డు, అది కూడా రాళ్లు తేలి గుంతలు పడటంతో, ఊట్ల గిరిజనులు తమ రాకపోకలు సాగించేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. బీటీ రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులను గురించి పాలకులు ఎవరూ పట్టించుకోవడం లేదని, కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే తాము గుర్తుకు వస్తామని చెప్పారు.

పెద్దయ్య దేవుడి భక్తులకు ఇబ్బందే..

ఊట్ల గిరిజన గ్రామ ప్రజలతో పాటు, అటవీ ప్రాంతంలో పెద్దయ్య దేవుని ఆలయం ఉంది. పెద్దయ్య ఆలయానికి ప్రతి గురు, ఆదివారాల్లో భక్తులు వెళ్తుంటారు. పెద్దయ్య దేవుని భక్తులకు కూడా రోడ్డు బాధలు తప్పడం లేదు. భక్తులు కూడా ఇదే రోడ్డు గుండా రాకపోకలు సాగించడంతో వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. వీరితో పాటు, గుండాల జలపాతానికి కూడా వెళ్లేందుకు ఇదే మార్గం కావడంతో, గుండాల జలపాతానికి వెళ్లే పర్యాటకులకు కూడా రోడ్డు కష్టాలు ఇబ్బందికి గురి చేస్తున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి బీటీ రోడ్డు అనుమతికి అటవీ శాఖ అనుమతులు ఇచ్చేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

రాళ్లు తేలినయ్..



రోడ్డు మొత్తం రాళ్లు తేలినయి. నడిచి వెళ్లాలన్న, సైకిళ్ల మీద పోవాలన్న కష్టంగా ఉంది. ఎవరూ పట్టించుకుంట లేరు. డాంబర్ రోడ్డు ఎయ్యాలి. ఓట్లప్పుడు మాత్రమే మేము గుర్తుకు వస్తాం తప్పా, మా ఇబ్బందులను గురించి ఎవరూ పట్టించుకుంటలేరు. – ఎర్రయ్య, ఊట్ల

డాంబర్ రోడ్డు ఎయ్యాలి..



మా ఊరికి రోడ్డు సక్కగా లేదు. డాంబర్ రోడ్డు ఎయ్యాలి. కంకర రోడ్డు ఉండటంతో, రావడం పోవడం ఇబ్బంది అయితంది. గతంలో రోడ్డుకు నిధులు మంజూరైనయి, కానీ ఫారెస్టోళ్లు అనుమతియ్యలే. దీంతో రోడ్డు ఎయ్యలే, సార్లు పట్టించుకుని డాంబర్ రోడ్డు ఎయ్యాలి. – నర్సయ్య, ఊట్ల

ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



నెన్నెలలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తాండూర్: ప్రజలందరూ ఈ సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తాండూర్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. తాండూర్ సర్కిల్ పరిధిలోని మాదారం టౌన్‌షిప్‌లో కేంద్ర భద్రతా బలగాలు, స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు ముగిసే వరకు పోలీసుల నిబంధనలు, సూచనలు పాటిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో మాదారం ఎస్సై అశోక్, తాండూర్ ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నెన్నెలలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

నెన్నెల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు నమ్మకం పెంచేందుకు మండల కేంద్రంలో బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ, కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ప్రజల్లో పోలీసులు ఉన్నారనే ధైర్యాన్ని నింపేందుకు, భద్రత భావాన్ని పెంపొందించేలా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. గ్రామాల్లో అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నెన్నెల, బెల్లంపల్లిటూటౌన్, తాళ్లగురిజాల ఎస్సైలు శ్యాంపటేల్, రమేష్, నరేష్‌లు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ, పెద్దంపేట గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో హాజీపూర్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మంచిర్యాల రూరల్ సీఐ తోట సంజీవ్, హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్‌తో పాటు సీఆర్‌పీఎఫ్ దళం, హాజీపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఎలక్షన్ జోష్!



ఓటు వేస్తున్న విద్యార్థి

దండేపల్లి: రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఎన్నికల సందడే కనిపిస్తోంది. విద్యార్థుల్లో సైతం ఎన్నికల జోష్ పెరిగింది. ఈ తరుణంలో దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించి, విద్యార్థులకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. నామినేషన్ దాఖలు చేయడం, బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు, ఎన్నికల్లో గెలుపొందిన వారికి ధ్రువపత్రాలు జారీ చేయడం, ప్రమాణ స్వీకారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అభ్యర్థులుగా, ఎన్నికల అధికారులుగా, ఓటర్లుగా విద్యార్థులు వ్యవహరించారు. దీంతో పాఠశాలలో ఎన్నికల సందడి కనిపించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక శనిత్రయోదశి పూజలు



మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో శనివారం కార్తీక మాస శనిత్రయోదశి పూజలు నిర్వహించారు. ఉదయం తెల్లవారుజామునుంచి ఆలయానికి తరలివచ్చి కార్తీక దీపాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ శనైశ్వర స్వామికి ప్రత్యేక తైలాభిషేకం జరిపారు. కార్యక్రమంలో ఈవో ముక్తా రవి, అర్చకులు నరహరిశర్మ, భట్టాచార్య, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

లక్ష్మీదేవి ఆలయంలో కుంకుమ పూజలు

జన్నారం: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీదేవి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం మహిళలు కుంకుమ పూజలు చేశారు. హనుమాన్ భక్తులతో చాలిసా పారాయణం చేశారు. అనంతరం పురోహితులు నరహరి శర్మ, గణేశ్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేసిన అనంతరం మహిళలు కుంకుమ పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



సంక్షిప్త వార్తలు

కోరం లేక మండల సమావేశం వాయిదా

జైపూర్: మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించగా కోరం లేక సమావేశం వాయిదా వేసినట్లుగా ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు.

కాంగ్రెస్ ప్రచారం

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లిలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వివేకానందను ఎమ్మెల్యేగా గెలిపించాలని గడపగడపకూ తిరుగుతూ ప్రచారం చేశారు. చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ప్రచారంలో రవీందర్‌రెడ్డి, డెబ్బ రామన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎన్నికల అవగాహన ర్యాలీ

జన్నారం: త్వరలో జరిగే ఎన్నికల్లో అందరూ పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ శనివారం స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ తీశారు. బస్టాండ్ నుంచి అంగడి బజార్ వరకు ర్యాలీ తీసి, అంబేద్కర్ విగ్రహం ముందు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కాసిపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై చొప్పరిపల్లి సమీపంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను శనివారం క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. మాజీ మంత్రి, బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ వాహనాన్ని సైతం తనిఖీ చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే విజయం

- కేసీఆర్‌కు ఓటమి తథ్యం
- కర్ణాటకలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసినం కర్ణాటక సివిల్ సప్లై మంత్రి మునియప్పన్
- ప్రేంసాగర్‌రావుకు మద్దతుగా మంచిర్యాలలో ప్రచారం



మాట్లాడుతున్న కర్ణాటక మంత్రి మునియప్పన్, పక్కనే కొక్కిరాల ప్రేం సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే విజయమని, ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు నీరాజనం పడుతున్నారని కర్ణాటక సివిల్ సప్లై మంత్రి మునియప్పన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన నాలుగు గ్యారంటీ హామీలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అమలు చేశామన్నారు. కానీ సీఎం హోదాలో ఉన్న కేసీఆర్ పక్క రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడం లేదనే అబద్ధాన్ని పదేపదే చెప్పడం ఆయన సంస్కారానికే వదిలేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదులో మంచిర్యాలను నంబర్ వన్‌గా నిలిపిన డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావులు ఇద్దరు అసెంబ్లీలో అడుగుపెట్టాలని కోరుకుంటున్నట్లు ఆకాంక్షించారు. అనంతరం మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేం సాగర్‌రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు చేసిన కేసీఆర్ తన స్థాయి మరిచి తనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి బలమైన పోటీని ఇచ్చేది, గెలిచేది తానే కాబట్టి తనపై విమర్శలు చేసేందుకు ఏమి లేకపోవడంతో, క్లబ్బుల పేరిట మాట్లాడి ఓట్లు దండుకుందామని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐసీసీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి మోహన్ జోషి, కర్ణాటక ఎమ్మెల్యేలు దేవేందరప్పన్, శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మామిడిశెట్టి వసుంధర, పట్టణ అధ్యక్షుడు నరేశ్ పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలే కాంగ్రెస్ ఎజెండా'

మంచిర్యాలటౌన్/లక్సెట్టిపేట: సోనియాగాంధీ నేతృత్వంలో రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఆరు గ్యారంటీ హామీలను ఎజెండాగా ప్రకటించారని, సంక్షేమ పథకాలే కాంగ్రెస్ ఎజెండా అని ప్రేం సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 8, 9 వార్డుల బహిరంగ సభ పాతమంచిర్యాలలో, 16, 17, 18వార్డులకు సంబంధించి బహిరంగ సభను ఓవర్‌బ్రిడ్జి వద్ద నిర్వహించి మాట్లాడారు. లక్సెట్టిపేటలో ప్రచారం చేశారు. చేయి గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం నూతనంగా చేరిన కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కర్ణాటక మంత్రి మునియప్ప, ఎమ్మెల్యే శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుండ సుధాకర్‌కు పరామర్శ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గుండ సుధాకర్ తల్లి గుండ రాజమణిబాయి మృతి చెందగా, ప్రేంసాగర్‌రావు పరామర్శించి నివాళులర్పించారు.



కార్మికులతో మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

'సొంతింటి పథకం అమలు చేస్తాం'

శ్రీరాంపూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేస్తామని ఆ పార్టీ మంచిర్యాల నియోజకవర్గం అభ్యర్థి ప్రేంసాగర్‌రావు తెలిపారు. ఆర్కే 7, ఆర్కే న్యూటెక్ గనులపై ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నేతలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ఐఎన్టీయూసీ బ్రాంచీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు



దండేపల్లి: మాట్లాడుతున్న దివాకర్‌రావు

దండేపల్లి: ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కారుగుర్తుకు ఓటేసి, మళ్లీ బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తేవాలని మంచిర్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే దివాకర్‌రావు కోరారు. దండేపల్లి మండలం లింగాపూర్‌లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ఓట్లు అభ్యర్థించారు. కారుగుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే, నియోజకవర్గాన్ని మరింతా అభివృద్ధి చేస్తానని చెప్పారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, స్థానిక ఉపసర్పంచ్ సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పాలనకు, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో జరుగుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన 100 మంది కాంగ్రెస్ నాయకులు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

బీఆర్‌ఎస్ ప్రచారంలో అత్తాకోడలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల అసెంబ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నడిపెల్లి దివాకర్‌రావుకు మద్దతుగా ఆయన భార్య రాజకుమారి, కోడలు ఉదయశ్రీలు శనివారం జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి, బీఆర్‌ఎస్ పార్టీ తరుపున కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అత్తా కోడలు కలిసి మహిళలను ఆప్యాయంగా పలకరించి, బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోను వారికి వివరించి, ఓటు వేసి, గెలిపించాలని కోరారు.



ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- చెన్నూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్



దుగ్నెపల్లి వద్ద ప్రచారంలో దుర్గం అశోక్

చెన్నూర్‌రూరల్: కమలం పువ్వు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్ ప్రజలను కోరారు. మండలంలోని దుగ్నెపల్లి, సుందరసాల, నర్సక్కపేట, పొక్కూరు, బీరెల్లి, కొమ్మెర, ఎర్రగుంటపల్లి గ్రామాల్లో శనివారం బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్ ప్రచారం చేపట్టారు. ప్రజలు ఆదరించి ఆశీర్వదిస్తే స్వచ్ఛమైన పాలనను అందిస్తానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ఆలం బాపు, కొటారి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

'దుర్గం అశోక్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలి'

జైపూర్: మండలంలోని ఇందారం, టేకుమట్ల గ్రామాల్లో దుర్గం అశోక్‌కు మద్దతుగా నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి, నిత్యం ప్రజలకు సేవ చేస్తున్న దుర్గం అశోక్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు.

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పలు వార్డుల్లో బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ కమలం పువ్వుకు ఓటు వేసి గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ పేద ప్రజలకు అండగా ఉంటుందని, అనేక సంక్షేమ పథకాలు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ చెన్నూర్ ఇన్‌చార్జి అక్కల రమేష్, నాయకులు దుర్గ రాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు అండగా నిలుస్తా

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్



మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఐలు

కడెం: తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఆదివాసీలకు అండగా నిలుస్తానని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. మండలంలోని కొండుకూర్ గ్రామంలోని ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుమూల గూడేల్లో సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు. ఇటీవల ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైన మండలంలోని పాండ్వపూర్‌కు చెందిన ఆర్సం శేఖర్ కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, జీవన్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వేణు, సర్పంచులు, నాయకులు స్టీఫెన్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు బుర్ర రవిగౌడ్ శనివారం ఖానాపూర్‌లో జాన్సన్‌నాయక్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇందులో ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ముడికే మల్లేశ్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: గుర్తుల గుర్తుంచుకో రామక్క...గులాబీల జెండలే రామక్క అంటూ బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పరిమి సురేశ్, కౌన్సిలర్ పరిమి లత ఆధ్వర్యంలో పట్టణంలో మహిళలు శనివారం ఆడిపాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరుతూ స్థానిక ప్రధాన కూడళ్ల వద్ద ప్రచారం చేశారు. నాయకులు నేత శ్యామ్, డా.కే హెచ్ ఖాన్, గణేశ్, రాధ, ఫైసల్, వాసేఖాన్, తదితరులు ఉన్నారు.

జాన్సన్ గెలిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు

ఖానాపూర్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్య జాన్సన్‌నాయక్ గెలిస్తే నియోజకవర్గ యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎన్‌ఆర్‌ఐలు పేర్కొన్నారు. పట్టణంలోని జాన్సన్ నాయక్ క్యాంప్ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. జాన్సన్‌నాయక్ గెలిస్తే జన్నారం మండలంలో ఒక ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకోవడంతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇంటర్నేషనల్ స్థాయి ప్రైవేటు పాఠశాలలు, కాల్‌సెంటర్, పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్‌ఆర్‌ఐలు డేవిడ్ మిలక్, శివ కాలేరు, రఘుపతిరెడ్డి, డి.శివ, శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



పాఠశాల విద్యార్థులతో ఎన్‌ఎస్‌ఎస్ వలంటరీలు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులు శనివారం క్షేత్ర పర్యటన చేపట్టారు. పిల్లల కోసం కార్యక్రమంలో భాగంగా కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం విభాగం విద్యార్థులు మండలంలోని తాళ్లగురిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా బోధన చేశారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం అధికారి రేష్మా మాట్లాడుతూ... విద్యార్థులకు గ్రామాల్లోని పాఠశాలల్లో క్షేత్ర పర్యటన చేయించడం ద్వారా అక్కడి స్థితిగతులను అభ్యసించడం జరుగుతుందన్నారు. వలంటీర్లలో సేవా భావం పెరుగుతుందని సూచించారు. అనంతరం విద్యార్థులు పాఠశాల ఆవరణాన్ని, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయ, కల్పనాకుమారి, డాగయ్య, చాంద్‌పాషా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై ఏబీవీపీ ఆధ్వర్యంలో అవగాహన

చెన్నూర్: పట్టణంలో జన జాగరణలో భాగంగా శనివారం ఇంటింటికీ ఓటు హక్కుపై ఏబీవీపీ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పోలింగ్ శాతం పెంచేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు మహేశ్, రత్న లక్ష్మీనారాయణరెడ్డి, మామిడి అక్షిత, సుధాకర్, శంకర్ పాల్గొన్నారు.